


"మీరప్లై చేసిన కంపెనీలో జాబ్ సంగ-తేమైందండీ?"

"సేల్స్ ఎక్జిక్యూటివ్ జాబ్ కదా? వేల-కువేల క్యాష్‌తోమాట! అందునా అల్లాటప్పా కంపెనీకాదు! పెద్దకంపెనీ! ఇద్దరు గవర్నమెం-టుద్యోగస్థుల షూరిటీ వుండాలన్నారు!"

"ఎవర్నైనా కనుక్కోలేక పోయారా?"

"మన ప్రతాప్ వొకడున్నాడు! ఇంకొకరు కావాలి!"

"అయితే... యింకొకరి షూరిటీ దొరికి-తే... ఆ వుద్యోగం ఖాయమేనన్నమాట! నెలకి పన్నెండొందల జీతం! టూర్లలో వున్నపుడు టి. యే, డి. యే సౌకర్యం! ఏమండీ... యెలాగే నా ప్రయత్నించండి! యీ అవకాశాన్నొదులుకో-కండి!"

కుతూహలంగా అంది భర్త శివానంద్‌తో యమున.

"యమునా. మనకి ప్రతాప్ యెలాగో, వాడికీ అంతకన్నా క్లోజ్ అయిన ఫ్రండున్నాట్ట మురళీధర్ అని.... కనుక్కుని వెంటనే యే విషయం చెబుతానన్నాడు!"

"అలాగా.... ఆ దేవుడి దయవల్ల అది ఖాయమైతే యెంత బావుండు! యీ చాలీ చాలని వుద్యోగం బాధైనా మనకి తప్పతుంది."

"ప్రతాప్ అన్నాడంటే.... నైంటీ పర్సం-ట్ గ్యారంటీ వుంటుంది! ఇహ మనకా జాబ్ వచ్చినట్టే ననుకో భార్యామణీ.... అవునూ... యీ రాత్రి కబుర్లతోనే తెల్లారి పోయేట్టుంది! టైం చూడు.... పదకొండు దాటింది! టూర్‌లోని వారం రోజుల విరహం వడ్డీతో సహా....."

"అబ్బో.... ఆశ..."

సిగ్గుపడుతున్న భార్యను దగ్గరకు తీసుకుంటూ వుత్సాహంగా లైటార్పేశాడు శివానంద్. అంత-లోనే ముందుగది తలుపు టక టకమంది. చటు-క్కున మంచం మీది నుండి లేచాడతను. మరు-క్షణంలోనే...."ఆ... యెవరోలెద్దూ.... నువ్వు. లేవద్దు!"అంటూ భార్యను వెళ్లనివ్వకుండా ఆమె చేయి పట్టి దగ్గరకు లాక్కోబోయాడతను. మళ్లీ టకటకమంది రెండోసారి తలుపు.

"వెళ్లక తప్పేట్టులేదు.... ఖర్మ ఖర్మ..."

అనుకుంటూ.... ఆదిలోనే తపోభంగమైన మునిలా లేచివెళ్లి లైటు వేసి ముందుగది తలుపు తీశాడు. ఎదురుగా తలుపవతల యెవరో అపరిచిత వ్యక్తి. అదోలా మొహం పెట్టాడు శివానంద్.

"ఎక్స్‌క్యూజ్ మి.... యీక్వార్టర్స్‌లోనే, 38 బ్లాక్ ఫ్లాట్ నెం. 5లో రాజారావు అనే ఆయన చేరాడు మొన్ననే.... స్టీల్ ఫ్యాక్టరీలో పన్జేస్తాడండీ.... దయచేసి ఆ క్వార్టర్ యెటువేపో చెబుతారా?"

చిట్లించిన మొహంలో చిరాకు దాచుకోలేక పోయాడు శివానంద్.

"రాజారావెవరో, రమణారావెవరో నాకు తెలీదు... సారీ..."

తుంచినట్టుగా అన్నాడు.

"అదికాదండీ.... జస్ట్... యీ బ్లాక్, ఫ్లాట్ నెంబర్ సూచిస్తే...."

"తెలీదంటున్నానుగా...."

తలుపు వేసుకోబోయాడు.

"ఎవరండీ...."

అక్కడి కొచ్చిన యమున అడిగింది.

'సారీ ఫర్ ది డిస్టర్బెన్స్...."

అపాలజిటిగ్గా అంటూ వెనుదిరిగాడా వ్యక్తి.

"ఎవరో.... ఏమిటో? ఎవరిదో అడ్రస్ కావాలిట! అర్ధరాత్రప్పుడు అథార్టీ వున్నట్టు తలుపు కొట్టటం, డిస్టర్బ్ చెయ్యటం, తేలిగ్గా సారీ చెప్పటం... ముక్కూ మొహం యెరక్కున్నా, అలా యెలా చెయ్య బుద్దేస్తుందో?"

లీలగా ఆవ్యక్తికామాటలు విన్పించాయనే, విన్పించాలనే అన్పించగా తలుపు మూసుకు-న్నాడు శివానంద్.

* * * *

"హాయ్... ప్రతాప్... కమాన్.... కమా-న్...."

ప్రొద్దున్నే వచ్చిన మిత్రుణ్ణాప్యాయంగా ఆహ్వానించాడు శివానంద్.

"ఒరే శివా... యూ ఆర్ సో లక్కీ... నీకు షూరిటీ యివ్వటానికొప్పకున్నాడ్రా మురళి! నే చెప్పలే? వాడు చాలా మంచి మనిషని? యెంతో హెల్పింగ్ నేచరని? ఆదివారం యింట్లోనే వుంటాను! రేపు నిన్ను తీసుకు రమ్మని చెప్పాడు నిన్న. పద వెళ్దాం! ఫామ్స్ కూడా తీసుకో! సంతకాలవీ పూర్తి చేసుకోవచ్చు!"


త్వరపెట్టాడు ప్రతాప్.

యమునందించిన టీ తీసుకుని ఆతురతగా బయట పడ్డారిద్దరూ.

* * * *

తిలక్‌నగర్‌లోని వో యింటిముందాగి కాలింగ్ బెల్ నొక్కాడు ప్రతాప్.

"నువ్వా ప్రతాప్... లోపలికిరా, నాయ-నా..." అంటూ సాదరంగా ఆహ్వానించినామెను మురళీధర్ తల్లిగా పరిచయం చేశాడు ప్రతాప్ శివానంద్‌కు.



"మురళి... స్నానం చేస్తున్నాడు... యిప్పుడే వచ్చేస్తాడు కూర్చోండి బాబూ... కాఫీ తెస్తాను!"

అంటూ ఆవిడ లోపలికెళ్లి పోయింది.

"హమ్మయ్య... అతనున్నాడు. ఇవాళే పని పూర్తవుతుంది. ఇహ ఆ ఉద్యోగం ఖాయం. పేరొందిన ఆ కంపెనీలో జాబ్ అంటే .. అదృష్టం పండినట్లే.!"

దాగలేని ఆనందం శివానంద్ వదనంలో ప్రస్ఫుటమవుతుంది.

ఆత్మీయంగా, ఆదరంగా అటు మురళి తల్లిదండ్రులూ, ఇటు అతడి భార్యా బిడ్డలూ.... ప్రతాప్‌ను సరేసరి, తన్నుకూడా అంత అభిమా-నంగా రిసీవ్ చేసుకున్న తీరుకి ముగ్ధుడయ్యాడు శివానంద్.

"ఎంత సంస్కారవంతమైన కుటుంబం? ప్రతాప్ మాటబద్ధంకాదు! దీన్ని బట్టి చూస్తుం-టే, వెరీ నైస్ జంట్లిమన్ మురళీధర్.. అన్పి-స్తుంది!" అనుకోకుండా వుండలేకపోయాడతను.

"వచ్చేశారా? " అంటూ ప్రవేశించిన మురళీధర్‌ని శివానంద్‌కు పరిచయం చేశాడు ప్రతాప్.

"నమస్కారం.. " అంటూ నవ్వుతూ చూసిన శివానంద్ మరి కాస్త పరిశీలనగా ముర-ళీధర్‌వేపు చూసాడు.

అప్పుడే స్నానం, ధ్యానం పూర్తి చేసు-కొచ్చినట్లుగా తెల్లని లుంగీ, షర్టుతో నుదుట చుక్కలాటి కుంకుమ బొట్టుతో, మృదుమందహా-సంతో, ఎదురుగా సోఫాలో కూర్చున్నాడతను!

ప్రతాప్ శివానంద్ గూర్చి చెబుతున్నా-డు. టిఫిన్, కాఫీలనంతరం, ఫామ్ తీసి మురళీధర్ ముందుంచాడు ప్రతాప్.

సంతకం పెట్టబోయాడు మురళీధర్.

"ఆగండి"

హఠాత్తుగా అడ్డుకున్నాడు శివానంద్.

"మురళీధర్‌గారూ.. మీరూ.. మీరూ.. నన్ను..నన్ను... గుర్తించారా?"

"అఫ్‌కోర్స్" తేలిగ్గా నవ్వేశాడతను.

"ప్లీజ్ మీరా కాగితంమీద సంతకం పెట్టకండి! నన్ను మనస్ఫూర్తిగా క్షమించాన-నండి! అప్పుడుగాని సంతోషంగా ఆ సంతకం స్వీకరించలేను!"

బాధ, పశ్చాత్తాపం శివానంద్ స్వరంలో

"ఏమిట్రా ఇదంతా?"

వింతగా అడిగాడు ప్రతాప్.

"ఒరే..ప్రతాప్.. మొన్న మురళీగారు మా యింటి కొచ్చార్రా.. ఎవరిదో అడ్రస్ అడిగితే... అపరిచితుడని నిర్లక్ష్యంగా కాదు పొమ్మన్నాను!"

మురళీధర్‌వేపు చూసాడు ప్రతాప్.

"ఆ మరేం లేదురా ప్రతాప్.. మా యింటి పక్కనున్న రాజారావు మొన్ననే యిల్లు ఖాళీ చేసి వెళ్లిపోయాడు. తల్లి ఆరోగ్య పరిస్థితి బాగాలేదని ఆయన పేరిట టెలిగ్రామొచ్చిందా అడ్రస్‌కే! అది తీసుకుని నేను వెంటనే ఆయన కొత్త అడ్రస్‌తో క్వార్టర్స్‌లో ఎంక్వైరీ చేయడం శివానంద్‌గారిని డిస్టర్బ్ చేయటమూ జరిగింది!"


దెబ్బతిన్నట్లు చూశాడు శివానంద్.

"అంతమాటనకండి మురళిగారూ.. కేవలం బంధుమిత్రులూ, స్నేహితులూ, పరిచయస్థులైతేతప్ప వారి అవసరమేమిటో గ్రహించలేని, ఆదరించలేని, మర్యాద చూపించలేని నా అవివేకపు ప్రవర్తనను మన్నించండి!

గుమ్మంముందుకొచ్చిన మనిషిని మీ అవసరమేమిటని, మీకోసం నేనేం చేయగలనని.. వో ఆదరణీయమైన పలకరింతతో, ఆచరణీయమైన సహన భావంతో, మనిషికీ మనిషికీ మధ్య నుండాల్సిన అవగాహనను స్నేహ భావనని సృష్టించుకోగల్గటంలో ముక్కూ మొహం ఎరిగుండాల్సిన అవసరంలేదని అర్థమైపోయిందిప్పుడే. ఏ ముక్కూ మొహం ఎరుగని నాకింతటి ఫ్యూరిటీ, ఎంతో నమ్మకంతో మీరివ్వసిద్ధపడితే.. చిన్నపాటి సమాచారమివ్వటానికే భంగపాటుగా న్యూసెన్స్‌గా ఫీలయ్యానంటే నిజంగా సిగ్గుపడుతున్నాను మురళీధర్‌గారూ!..."

శివానంద్ మనసూ, కళ్లూ రెండూ చెమర్చాయి.

"ఇట్సాల్‌రైట్.. టేకిట్ ఈజీ శివానంద్‌గారూ.." స్నేహభావంతో శివానంద్ భుజం తట్టాడు.




ఆ చేత్తోనే కాగితంపై సంతకం పెట్టాడు. మురళీధర్..

తను, తనవాళ్లు.. తనకు తెల్సిన వాళ్లకే తన కర్తవ్యాదరణలు, ప్రేమాభిమానాలు పరిమితమనుకుంటే ఆ పరిధక్కడికే అంతమౌతుంది కూపస్థమండూకంలా!

మనిషిగా ప్రతి సాటి మనిషిపట్ల తనకున్న కనీస కర్తవ్యం గుర్తు చేసుకుంటే ఒకరికొకరన్న స్నేహ సౌహార్ద్ర భావాలతో మనగల్గితే.. ఆ పరిధి విస్తృతమై విశ్వవ్యాప్త మౌతుంది కూడా!

అన్నట్టుగా రెపరెపలా డిందా కాగితం విశ్వకేతనంలా విపులీకృతమౌతూ! ●